

# సత్యవాక్యం

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

AUGUST - 2010

సంవత్సర చందా రూ. 50/-

## సత్యవాణి - క్రీస్తు సంఘము
## బైబిలు లెక్చర్‌షిప్

| | | |
|---|---|---|
| **సమయం** | : | 2010 అక్టోబరు 24 నుండి 28 వరకు |
| **ఉదయం** | : | 10 గంటలకు |
| **మధ్యాహ్నం** | : | 3.00 గంటలకు |
| **రాత్రి:** | | 7.00 గంటలకు |
| **స్థలము** | : | సత్యవాణి - క్రీస్తు సంఘము<br>7-9-35, సాంబమూర్తి వీధి<br>రామారావు పేట,<br>కాకినాడ - 533 004 |
| **ప్రసంగీకులు** | : | అమెరికా, ఇండియా దేశ సువార్తికులు |
| **అంశము** | : | "You Can be Sure" |

మీరు తప్పక రండి, భోజన వసతులు ఉచితం. మీరు, మీ సంఘస్థులు తప్పక వచ్చి ఆత్మీయ మేలు పొందండి. మీకు మా హృదయపూర్వక స్వాగతం.

వందనములతో
Bro రిక్కీ గూటం
Bro జాషువా గూటం

ఫోన్ నెంబర్ : 0884- 2363722, 2363697

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | ఆగస్టు - 2010 | సంచిక - 1


## క్రైస్తవుడవైన తరువాత నీవేమి చేయాలి?

( What you do after becoming a Christian)

పాపియైన మానవుడు యేసు ప్రభువు దేవుని కుమారుడని విశ్వసించి. తన పాపముల విషయమై మారుమనస్సు నొంది, యేసు క్రీస్తు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందితే క్రైస్తవుడవుతాడు. అయితే ఆ తరువాత అతడు చేయవలసిన దేమిటి?

క్రైస్తవుడు మార్పు జెందిన వాడు. తన గత జీవితాన్ని మార్చుకొన్నవాడు. గనుక ఒక క్రొత్త జీవిత విధానాన్ని జీవించుటకుపకరిస్తాడు. మార్పుజెందక ముందు అతని కున్న పాత అలవాట్లను, స్నేహితులను, దుర్భాష వగయిరా లన్నింటినీ విసర్జిస్తాడు. తన పాపముల విషయమై నిజమైన మారు మనస్సు పొందుట వలన యిది సాధ్యపడును. "అలాగైన ఏమందుము? కృప విస్తరించవలెనని పాపమందు నిలిచి యుందుమా ? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించు దుము?" అని అపొ.పౌలు అడుగుచు న్నాడు (రోమా 6:1,2). అందువలన క్రైస్తవుడైన ప్రతివాడు నూతన జీవితము

కలిగి నడుచు కొనును.

మరల క్రైస్తవుడు నిర్మలమైన వాక్యమును ఆశతో ఆపేక్షించును. తద్వారా అతడు దిన దినము ఆత్మీయముగా పెరుగును. అపొ. పేతురు ఇట్లనుచున్నాడు: "ప్రభువు దయాళుడని మీరు రుచి చూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని క్రొత్తగా జన్మించిన శిశువులను పోలిన వారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1 పేతురు 2:1,3). మనం నీతి నిమిత్తం ఆకలి దప్పులు కలిగి యుండాలి (మత్తయి 5:6). క్రొత్తగా జన్మించిన శిశువు పాలను ఎట్లు ఆపేక్షిస్తాడో అట్లే మనం దేవుని వాక్యమును అపేక్షిస్తు క్రమేపి బలమైన ఆహారము భుజించగల్గునట్లు ఆత్మీయంగా వాక్యంలో ఎదగాలి. ఆత్మీయాకలి కుంటుపడితే ఆత్మీయ అనారోగ్యమును అది సూచిస్తుంది.

తరువాత, క్రైస్తవుడు క్రీస్తు నామమును ఎల్ల వేళలా ఘన పరుస్తాడు, "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1 పేతురు 4:16). క్రైస్తవులైన తరువాత అనేకులు తమ జీవితములో మార్పు కనబరచరు. గత పాప జీవితాన్నే జీవిస్తు వుంటారు. అట్టి వారు మారు మనస్సు పొందిన వారు కారు. అందువలన "మీకు పెట్టబడిన శ్రేష్టమైన నామమును దూషించు వారు వీరే కదా?" యని పరిశుద్ధాత్ముడు అడుగు చున్నాడు (యాకోబు 2:7).

క్రైస్తవుడైన తరువాత విశ్వాస విధేయతలలో నిలకడగా యుండాలి. ఆదిమ క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి." కానుక లిచ్చుటలో కూడ వారు నిలకడగా యుండిరి (అపో.కా. 2:47).

మరల, క్రైస్తవుడైన వాడు సంఘక్షేమాభివృద్ధి నిమిత్తము కష్టపడి పనిచేయాలి. "అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను. గాలికి కొట్టుకొనిపోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొని పోవుచు అలల చేత ఎగర గొట్ట బడిన వారమైనట్లుండక ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము. ఆయన శిరస్సయి ఉన్నాడు. ఆయన నుండి సర్వ శరీరము చక్కగా అమర్చబడి, తనలో నున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పని చేయు చుండగా ప్రతి కీలు

వలన కలిగిన బలము చేత అతుకబడి, ప్రేమ యందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగ జేసికొను చున్నది" (ఎఫెసీ 4:14-15).

క్రైస్తవుడెల్లప్పుడు పైనున్న వాటి మీదనే లక్ష్యపెట్టాలి గాని భూసంబంధమైన వాటిని కాదు. అతడు బాప్తిస్మము ద్వారా క్రీస్తుతో కూడ పాతి పెట్టబడిన వాడు. అపొ.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "మీరు క్రీస్తుతో కూడ లేప బడినవారైతే పైనున్న వాటిమీదనే గాని, భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టు కొనకుడి ; ఏలయనగా మీరు మృతి పొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి యున్నది. మనకు జీవమై యున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచ బడుదురు" (కొలస్స 3:1,4). మన తండ్రియైన దేవుడు పరలోక మందున్నారు (మత్త 6:9). మన స్వాస్థ్యము, మన నిరీక్షణ, మన పౌరసత్వము మన రక్షకుడు కూడ పరలోకమందున్నారు (1 పేతురు 1:4; కొలస్స 1:5; ఫిలిప్పీ 3:20).

క్రైస్తవుడైన ప్రతివాడు యితరులకు క్రీస్తును గూర్చి చెబుతాడు. యేసు గూర్చి చెప్పరాదని కొందరు అభ్యంతర పెట్టినా, పేతురు యోహానుల వలె మేము కన్నవాటిని, విన్నవాటిని చెప్పక యుండవలేమని క్రైస్తవులు జవాబిస్తారు. సౌలు పౌలుగా మారినప్పుడు, "వెంటనే సమాజ మందిరములలో యేసే దేవుని కుమారుడని ఆయనను గూర్చి ప్రకటించుచు వచ్చెను"(అపొ.కా. 9:20). క్రైస్తవుడు ఇతరులను రక్షించుటకు తాను రక్షింపబడ్డాడు; ఇతరులను కనుగొనడానికి కనుగొనబడ్డాడు, ఇతరులకు బోధించడానికి బోధింపబడ్డాడు, క్రీస్తు కొరకు జయించడానికి జయింపబడ్డాడు, శిష్యులను చేయడానికి శిష్యుడయ్యాడు.

ఒకడు క్రైస్తవుడైన తరువాత, విశ్వాసమునందు నిలుకడగా యుండాలి. అంటే విశ్వాస భ్రష్టత్వానికి పాల్పడకూడదు. అపొ.కా. 8వ అధ్యాయములో సీమోనను గారడీ వాడు ఫిలిప్పు సువార్త చెప్పగా నమ్మి, బాప్తిస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండెను. సూచక క్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను. అయితే అపొస్తలులైన పేతురు యోహానులు చేతులుంచగా పరిశుద్ధాత్మ దిగి వచ్చుచు న్నాడని గ్రహించి ద్రవ్యమిచ్చి ఆ వరమును కొన జూచెను. పాపము చేసి భ్రష్టత్వములో పడెను. గనుక క్రైస్తవులైన కొందరు వాక్యమునకు లోబడి కాలము గడిచిన కొలది ఈ జీవసంబంధమైన విచారముల చేతను ధన భోగముల చేతను అణచి వేయబడి పరిపక్వముగా ఫలింపని వారు (లూకా

8:14). "వారు నీతి మార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె, ఆ మార్గము అనుభవ పూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు" (2 పేతురు 2:21). అట్టిది నీకు సంభవింప కుండాలంటే ప్రతి దినము నీవు దేవునితో ప్రార్ధనలో మాట్లాడు. ప్రతి దినము బైబిలును చదువుట ద్వారా ఆయనను నీతో మాట్లాడనియ్యి. ప్రతి రోజు దేవునికి ఏదో ఒకటి చెయ్యి, దేవుడు నీకు ఏదో ఒకటి చేయనియ్యి.

దేవుని బిడ్డవలె, అనుదినం నీవు దేవునికి లోబడుచు యుండాలి. ఒక సైనికునివలె నీవు అనుదినం విశ్వాస సహితమైన మంచి పోరాటాన్ని పోరాడాలి. ఒక పనివానివలె, దేవునికి అనుదినం నమ్మకమైన పరిచర్య చేయాలి. "కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువు నందు వ్యర్ధము కాదని యెరిగి, స్థిరులును కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులై యుండుడి" (1 కొరింథీ 15:58). క్రైస్తవుడు ద్రాక్షవల్లియైన క్రీస్తులో ఉండిన తీగ వలె మంచి ఫలములు ఫలించాలి, యాజకుని వలె దేవునికి ఆత్మ సంబంధమైన బలుల నర్పించాలి (1 పేతురు 2:5). క్రీస్తు వధువైన సంఘములో సభ్యునిగా యుంటూ సంఘము యొక్క పవిత్రతను కాపాడుకొనాలి. ఆయన శరీరములో ఐక్యతను కొనసాగించాలి. పరలోక పౌరునివలె పరలోక ప్రభుత్వానికి లోబడాలి (హెబ్రీ 5:10). ఒక గొఱ్ఱెపిల్ల వలె ప్రభువును ఎల్లవేళలా వెంబడించాలి.

క్రైస్తవుడైన వాడు గొప్ప ఆశీర్వాదములను పొందియున్నాడు, అంతే కాదు గొప్ప బాధ్యతలను స్వీకరించాడు. నీవు క్రైస్తవుడవు, క్రీస్తు శిష్యుడవు కాగోరుచున్న యెడల యేసు ప్రభువు నందు విశ్వాసముంచుము, నీపాపముల విషయమై మారు మనస్సునొందుము, క్రీస్తులోనికి పాపక్షమాపణ నిమిత్తం బాప్తీస్మము పొందుము. దేవుడు నిన్ను దీవించునుగాక !!.

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# లిఖిత పూర్వక ప్రతుల రుజువు

## (Documentary Evidence)

అపొస్తులులు వారి అనుచరులచే మొదటి శతాబ్దములోనే క్రొత్త నిబంధన వ్రాయబడెనని మనకేలాగు తెలియును? లేదా రెండవ లేక మూడవ శతాబ్దములలో జీవించిన వ్యక్తులచే అది వ్రాయబడలేదని మనకెట్లు తెలియును? వారు కల్పితానికి వాస్తవానికి దూరముగా యున్నవారు.

రెండవదిగా, నేడున్న క్రొత్త నిబంధన గ్రంధము ఆదిమ గ్రంధకర్తలు వ్రాసినదే యనుటకు మనకున్న నిర్ధారణ యేది? అది శతాబ్దముల తరబడి కలుషరహితంగా మన వరకు వచ్చి యున్నదనుటకు రుజువుయేది? శతాబ్దముల తరబడి క్రొత్తనిబంధనను చేవ్రాత ద్వారా వ్రాసినవారు, ఖచ్చితంగా తప్పులులేకుండా కాపీ చేసి యిచ్చారను కొనుటకు రుజువు యేది? ఆదిమ ప్రతులను కలిగియున్నవారు మోసపూరిత చర్యలకు పాల్పడలేదని మనకెట్లు తెలియును? ఈ పాఠంలో ఇట్టి ప్రశ్నలకు జవాబును కనుగొందాము.

**జీవిత కాల పరీక్ష** (The Biographical Test) :

పురాతన చారిత్రక లిఖిత ప్రతులు, వాటి కాపీలు యదార్ధమైనవో కావో తెలిసికొనుటకు వాటిని జీవిత కాల పరీక్షకు గురిచేసేవారు. ఆదిమ ప్రతితో యివి. సరిగ్గా యున్నవో లేదో, లేదా ఏమైన వాటిలో మార్పులు. చేర్పులు చేయబడ్డాయో నిర్ధారించుటకు ఈ పరీక్ష సహాయపడును. ఈ పరీక్షలో దిగువ ప్రశ్నలకు సమాధానము దొరుకును.

1. మనం పరీక్షించే లిఖిత దస్తావేజు యొక్క కాపీలు ఎన్ని వున్నాయి? ఎక్కువ కాపీలు వుంటే వాటిని ఒక దానితో మరొకటి పోల్చి ఏయే మార్పులు సంభవించాయో తెలిసికొనవచ్చును.

2. ఈ కాపీలు ఎక్కడ దొరికాయి? అవన్నీ ఒకే చోట లభ్యమైతే కూడబలుకుకొని చేయుట సాధ్యము. గాని అవి వేర్వేరు చోట్ల కాలములోను, స్థలములోను దూరములోను యుంటే కావాలని చేసినట్లగుపడదు.

3. ఆదిమ దస్తావేజుకు కాపీలకు మధ్యయున్న కాల వ్యవధి ఎంత? ఆదిమ దస్తావేజు వ్రాయబడిన కొన్ని శతాబ్దముల తరువాత కాపీలు వ్రాయబడితే, మార్పులు సంభవించియుండును గాని కాల వ్యవధి స్వల్పమే అయితే మార్పులు సంభవించుటకు అవకాశముండదు. కాల వ్యవధి స్వల్పమే అయితే ఆ దస్తావేజు నమ్మదగినదే.

4. కాపీలలో కనబడే వ్యత్యాసము యేమిటి?

కాపీలలో అసంఖ్యాకమైన ప్రాముఖ్య మార్పులు కనబడితే, ఆదిమ గ్రంధకర్త యేమి వ్రాసాడో తెలిసికొనుట సాధ్యము కాదు. గాని ఆ వ్యత్యాసములు స్వల్పము గానున్నట్లయితే, అవి ఆదిమ ప్రతికి నమ్మకముగానే యున్నట్లగును.

**క్రొత్త నిబంధనకు జీవిత కాల పరీక్ష:**

ఇప్పుడు ఈ జీవితకాల పరీక్షను క్రొత్త నిబంధనకు వర్తింప జేయుదము ; మనకు లభించే జవాబులు ఏమిటో తెలిసికొందాము.

1. గ్రీకు క్రొత్త నిబంధన కాపీలు ఎన్ని యున్నాయి? క్రొత్త నిబంధన సంపూర్తిగా గాని, వేర్వేరు భాగములుగా గాని వ్రాయబడిన 57000 పురాతన లిఖిత ప్రతులున్నాయి. 10,000 కాపీలు లాటిన్ లోను, 9300 కాపీలు ఇతియోపిక్, స్లావిక్, ఆర్మేనియన్, మొదలగు భాషలలోను ఉన్నాయి. మొత్తము ఒకదానితో మరొకటి సరిపోల్చదగిన 24,000 క్రొత్త నిబంధన లిఖిత ప్రతులున్నాయి.

అయితే ప్లేటో, ప్లీనీలు వ్రాసిన గ్రంధముల ప్రతులు 7 మాత్రమే ఉన్నాయి. హేరోడోటస్ వ్రాసిన చరిత్ర కాపీలు 8ఉన్నాయి. కైసరు వ్రాసిన గాలిక్ యుద్ధ ములు (Gallic Wars) ప్రతులు 10, టేసిటస్ వ్రాసిన Annals of Imperial Rome & Livy's history of Rome కాపీలు , డొమెస్తెనీస్ యొక్క వ్రాతలు 200 కాపీలు, హోమర్ వ్రాసిన ఇలియాడ్ 200 కాపీలు ఉన్నాయి. పురాతన గ్రంధములు, వ్రాతల యొక్క ప్రతులన్నిటి కంటే, క్రొత్త నిబంధన ప్రతులు ఎన్నో రెట్లు ఎక్కువ యున్నాయి.

2. క్రొత్త నిబంధన వ్రాత ప్రతులు ఎక్కడ దొరికాయి? అవి రకరకాల చోట్ల దొరికాయి. ఈ కాపీలు అంత విశాల విస్తీర్ణములో వ్యాపించియున్నాయి గనుక పూర్వకాలములో సమిష్టి కుట్ర అసంభవము.

3. ఆదిమ ప్రతికిని, దాని కాపీలకును, మధ్య ఎంతకాలము గడిచిపోయింది? లభ్యమైన అతిపురాతన క్రొత్త నిబంధన వ్రాత ప్రతి క్రీ॥శ 125 లో వ్రాయబడి John Rylands Fragment అని పిలువబడేదీ. ఒక నిపుణుడైతే అది క్రీ॥శ 100లో వ్రాయబడిందని చెబుతాడు. దొరికిన భాగములో యోహాను సువార్త 18:31 నుండి, 33వ వచనము వరకును, మరల 37-38 వచనములను కూడ చూడవచ్చును.

క్రీ॥శ 1992లో డా॥కార్ల్ స్టన్ ధియెడ్ అను జర్మన్ దేశపు పేపిరస్ వ్రాతప్రతుల నిపుణుడు ఒక ఆశ్చర్యకరమైన మాట చెప్పాడు. మత్తయి, మార్కు లూకా సువార్తల భాగములతో దొరికిన 5 పేపిరస్ వ్రాత ప్రతులు క్రీ॥శ 50-68 మధ్య వ్రాయబడినవని అతడు చెప్పాడు. అతడు చెప్పినది యదార్ధమైతే ఆదిమ ప్రతులకు 10 సంవత్సరము

లలోనే అవి కాపీ చేయబడెను.

దొరికిన పేపిరస్ వ్రాత ప్రతుల 99 ముక్కలలో క్రొత్త నిబంధనలోని ఒకటి లేదా ఎక్కువ భాగములు అందు వ్రాయబడియున్నవి. క్రీ॥శ 200లో వ్రాయబడిన చెస్టర్ బీయేటీపేపిరై ప్రతిలో ఇంచుమించు క్రొత్త నిబంధన అంతా యున్నది.

ప్రాముఖ్యముగా, క్రొత్త నిబంధన వ్రాయబడిన తరువాత 3 లేక 4 వందల సంవత్సరములలో, దాని పూర్తి ప్రతులు గాని, భాగములు గాని అనేకములు కాపీ చేయబడెను. Codex Vaticanus అనే వ్రాత ప్రతి రోమాలో వేటికన్‌లో యున్నది. కాన్‌స్టాంటిన్ చక్రవర్తి క్రీ॥శ 325లో వ్రాయించిన క్రొత్త నిబంధన ప్రతి యిది. Codex Sinaticus అనే ప్రతి St కేథరిన్ మోనాస్టరీలో లభ్యమయ్యింది. ఈ క్రైస్తవ మతమఠము సీనాయి కొండ దిగువ భాగములో యుండెను. క్రీ॥శ 350 లో వ్రాయబడిన క్రొత్త నిబంధన యొక్క సంపూర్ణ ప్రతి అది.

Codex Alexandrius అనే ప్రతి ఈజిప్టులో, అలెగ్జాండ్రియాలో లభ్యమాయెను. ఇవియే గాక గ్రీకు, లాటిన్, సిరయన్, స్లావిక్, ఆర్మేనియన్ భాషలలో వ్రాయబడిన క్రొత్త నిబంధన ప్రతులు వందలాదిగా యున్నాయి. అవన్నీ క్రీ॥శ ॥100 నుండి 500 సంవత్సరము వరకు వ్రాయబడినవే.

బ్రిటీషు మ్యూజియమ్‌కు యిదివరలో డైరక్టరుగా పనిచేసిన సర్ ఫ్రెడరెక్ కెన్యాన్ అనునతడు ఇట్లు చెప్పాడు : "క్రొత్త నిబంధనకు దాని ప్రతులకు మధ్యయున్న వ్యవధి అతి స్వల్పమే. మరియే యితర గ్రంధముల ప్రతులకు ఇంత స్వల్ప వ్యవధిలేదు".

మనం పైన చెప్పుకొనిన కొన్ని చరిత్ర గ్రంధములతో క్రొత్త నిబంధనను పోల్చిచూదుము. హెరోడోటస్ వ్రాసిన చరిత్ర గ్రంధము యొక్క మొదటి ప్రతి ఆదిమ గ్రంథం వ్రాయబడిన 1350 సంవత్సరముల తరువాత తయారు చేయబడెను. Thucydides వ్రాసిన చరిత్ర గ్రంధము యొక్క కాపీ 1300 సం॥ముల తరువాత తయారు చేయబడెను. కైసరు వ్రాసిన గాలిక్ యుద్ధములు అను గ్రంధముకు దాని ప్రతులకు 1000 సంవత్సరముల వ్యవధి యుండెను. టేసిటస్ వ్రాసిన Histories కు దాని ప్రతులకు మధ్య 750 సం॥ల వ్యవధి యుండెను. అతడు వ్రాసిన Annals కు 950 సం॥ల వ్యవధియుండెను. అయినను ఈ చరిత్ర గ్రంధములు నమ్మదగినవనే మన పాఠశాలలో బోధింపబడుచున్నది.

పురాతన గ్రంధములన్నిటి కంటే క్రొత్త నిబంధనను రుజువుపరచు అనేక దస్తావేజులున్నాయను సంగతి విధితమే. మరల ఆదిమ గ్రంధానికి దాని ప్రతులకు

మధ్యయున్న వ్యవధి బహు స్వల్పమే. యితర గ్రంథాల కయితే అది శతాబ్ధముల తరబడి యున్నది.

4. క్రొత్త నిబంధన వ్రాత ప్రతులో ఏమైన తేడాలున్నాయా? వేలకొలదియున్న వ్రాత ప్రతులలో నిజానికి కొన్ని వ్యత్యాసాలున్నాయి. అయితే ఈ ప్రతులన్నీ ఒక యంత్రము వలనగాక, చేతితో తయారు చేయబడ్డాయనే సంగతిని మనం గమనించాలి. పొరబాట్లు జరుగకుండా ఎంత జాగ్రత్త వహించినను, పొరబాట్లు జరుగుట సహజమే, సంభవమే, అయితే ఈ పొరబాట్లలో ఎక్కువ అక్షర దోషములోను, భాషా సరణిలోనే యున్నవి. అవి ఎన్నత తగినవి కావు.

"పురాతన గ్రంథములన్నిటి కంటే క్రొత్త నిబంధన యొక్క యదార్థత ఎక్కువ నిరూపించబడినది. దాని యదార్థతను గూర్చిన రుజువులు లేక పోవుట వలన గాక, అవి ఎక్కువై యున్నందున ఆ గ్రంథముకు సమస్యలుద్భవించుచున్నవి" యని సర్ ఫ్రెడరిక్ కెన్యాన్ చెప్పారు.

బైబిలులో వేలకొలది పొరబాట్లున్నాయని విమర్శకులు చెబుతారు. 5700 గ్రీకు వ్రాత ప్రతులలో అనేక అక్షర దోషములు, భాషా సరిణి దోషములు, కొన్ని సందర్భాలలో మధ్యలో ఒక మాటలేక అక్షరం కనబడక పోవడంలాంటి దోషములన్నాయి. ఒకమాట గనుక ఒక ప్రతిలో 3000 సార్లు తప్పుగా వ్రాయబడితే, 3000 తేడాలు రికార్డులో మనకు స్పష్టమగును.

అయితే నూటికి ఒక శాతంలోను సగం మాత్రమే ఈ తేడాలు సమస్యాత్మకము. Homer వ్రాసిన Illiad యొక్క ప్రతులలో నూటికి 5 శాతం తేడాలున్నాయి. బైబిలులో కనబడు తేడాలను బట్టి సిద్ధాంత రీత్యా దోషం యేమీ సంభవింపదు. వ్రాత ప్రతులను ఒక దానితో నొకటి పోల్చుట వలన నిపుణులు క్రొత్త నిబంధనను 99.5 శాతం పునరుద్ధరించ గలిగారు. దోషములని చెప్పబడునవి కూడ ఏకీభవించబడినవి. లేఖనములు ఆదిలో ఎట్లు ఈయబడెనో, వాటినే మనము ఇప్పుడు కలిగియున్నా మనుటకు గొప్ప ఆధారమున్నదని సర్ ఫ్రెడరిక్ కెన్యాను అన్నారు. క్రొత్త నిబంధన హెచ్చు మార్కులతో జీవితకాల పరీక్షలో విజయం సాధించింది.

**క్రొత్తనిబంధన త్వరగా వ్రాయబడెను:**

పౌలు కైసరు యెదుట విమర్శింపబడుటకు ఖైదీగా కనిపెట్టుచు యున్న సందర్భముతో అపొస్తులుల కార్యముల గ్రంథము అకస్మాత్తుగా ముగియుచున్నది (అపొ.కా. 28:30, 31). అపొస్తలులకార్యముల గ్రంథమును లూకా వ్రాసాడు. పౌలు నీరో చక్రవర్తి యెదుట నిలబడక ముందు అప్పటికి అతడు గృహ నిర్బంధములో యుండెను. దీనిని బట్టి అపొ.కార్యముల గ్రంథము

క్రీ॥శ 62లో వ్రాయబడెను. లూకా సువార్త అంతకు ముందే వ్రాయబడెను (లూకా 1:1,4; అపో.కా. 1:1,2). అంటే లూకా సువార్త అపొస్తలుల కార్యములు, క్రీస్తు మరణించి, సమాధి చేయబడి తిరిగి లేచిన 30 సంవత్సరముల లోపే వ్రాయబడెను. ఒక చరిత్రాత్మక సంఘట నను కట్టుకథగా మార్చడానికి ఆ సమయం చాలదు.

క్రొత్త నిబంధన త్వరలో ముగించ బడెననుటకు మరొక ఆధారము , దానిలో యెరూషలేము దేవాలయము నాశనం చేయబడునని యేసు చెప్పిన ప్రవచనము ను మత్తయి, మార్కు, లూకాలు వ్రాసారు (మత్త 24:1,2; మార్కు 13:1,2; లూకా 21:5,6). యెరూషలేమును , దానిలోని దేవాలయమును క్రీ॥శ 70 సం॥లో రోమా సైనికులచే యేసు చెప్పినట్లే నాశనం గావించబడెనని జోసిఫిన్ అనే చరిత్ర కారుడు వ్రాసాడు. అయినను ఇంత ప్రాముఖ్యఘట్టము క్రొత్త నిబంధనలో ఎక్కడా చెప్పబడలేదు. క్రొత్త నిబంధనలో ఏ భాగమైనా క్రీ॥శ 70 సంవత్సరము తరువాత వ్రాయబడి యుంటే, యేసు ప్రభువు చెప్పిన ప్రవచన నెరవేర్పుగా ఆ సంఘటన తప్పక వ్రాయబడి యుండేది. అందు వలన క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములు అన్నియు క్రీ॥శ 70వ సంవత్సరమునకు ముందే వ్రాయబడెనను టకు నిర్ధారణయై యున్నది.

**ఆదిమ క్రైస్తవుల వ్రాతలు :**

క్రొత్త నిబంధన త్వరగా వ్రాయబడెన నుటకు మరొక రుజువు ఆదిమ సంఘ నాయకుల వ్రాతలు.

క్లెమెంతు కొరింధీయులకు క్రీ॥శ 95లో పత్రిక వ్రాసాడు, ఈ ప్రతికలో అతడు మత్తయి, మార్కు లూకా, అపొ.కార్యములు రోమా పత్రిక 1 కొరింధీయులు, ఎఫెసీ, తీతు, హెబ్రీ, మరియు 1 పేతురు పత్రికల నుండి లేఖనముల నెత్తి చూపించాడు.

క్రీ॥శ 115 లో ఇగ్నేషియస్ వ్రాసిన పత్రికలు ఆసియాలోని కొన్ని సంఘాలకు వ్రాసాడు. అతడు మత్తయి, ఎఫెసీ, ఫిలిప్పీ, 1,2 తిమోతి, తీతు పత్రికలలోని మాటలను అందులో వ్రాసాడు.

క్రీ॥శ120 లో పోలికార్పు ఫిలిప్పీ యులకు వ్రాసిన పత్రికలో మత్తయి, మార్కు లూకా, అపో.కార్యములు రోమా,1,2 కొరింధీయులకు, గలతీ, ఎఫెసీ , ఫిలిప్పీ, 2 థెస్స, 1,2 తిమోతి, హెబ్రీ, 1 పేతురు మరియు 1యోహాను పత్రికలలోని మాటల ను అందులో వ్రాసాడు.

క్రొత్త నిబంధనలో 11వ చనములు తప్ప మిగతావన్నీ ఆదిమ సంఘనాయకుల వ్రాతలలో కనబడ్డాయి. దీనిని బట్టి క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములు ప్రఖ్యాతి గాంచి,విరివిగా ప్రజలచే వాడబడుచున్న వని మొదటి రెండు శతాబ్దముల సంఘ చరిత్రను బట్టి గ్రహించుకొనగలము.

# ఆరాధనలో వాద్య సంగీతము దేవుని వలన కలిగెనా?లేక మానవుని వలన కలిగెనా?

(Instrumental music in worship from God or Man ?)

ఈ ప్రశ్నకు జవాబును కనుగొను విధానము ఒకే ఒక్కటి యున్నది. క్రొత్త నిబంధన యొద్దకు వెళ్లి మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘారాధనలో వాద్య సంగీతము ఉండెనో లేదో తెలిసి కొంటే సరిపోతుంది. మన ప్రశ్నకు జవాబుగా క్రొత్త నిబంధనలో కనీసము పది లేఖన భాగములున్నవి.

ఈ లేఖన భాగములను ప్రతి దానిని జాగ్రత్తగా గమనించుదము.

1."అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి" (మత్తయి 26:30)

2. మార్కు 14:26లో కూడ యివే మాటలు వ్రాయబడినవి.

3. "అయితే మధ్య రాత్రి వేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచుండిరి, ఖయిదీలు వినుచుండిరి" (అపో.కా. 16:25).

4. "ఈ హేతువు చేతను అన్య జనులలో నిన్ను స్తుతింతును; నీ నామ సంకీర్తనము చేయుదును" (రోమా 15:9).

5. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును మనస్సుతోను పాడుదును" (1 కొరింథీ (14:15).

6. "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19).

7. "సంగీతములతోను కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధి చెప్పుచు కృపాసహితముగామీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపని య్యుడి" (కొలస్స 3:16).

8."ఈ హేతువు చేతను... నీ నామమును నా సహోదరులకు ప్రచుర పరతును సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును" (హెబ్రీ 2:12).

9 "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

10. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా ? అతడు కీర్తనలు పాడవలెను" (యాకోబు 5:13).

ఈ వచనములను చదివిన తరువాత మంచి మనసు గల ప్రతివాడు

క్రొత్త నిబంధనలో పాటలు పాడుటను (గాత్ర సంగీతమును) గూర్చి మాత్రమే మనం చదువ గలమని అంగీకరించుము. సంఘారాధనలో పియానోగాని, డమ్ము కంజరి మొదలగు వాద్యములను గూర్చిన లేఖన భాగములు గాని ఎక్కడా మనకు కనబడవు. దీనికి కారణం చాలా సూక్ష్మం : క్రీస్తు సంఘములు ఆరాధనలో ఎన్నడు వాద్యముల నుపయోగించలేదు! ఆదిమ క్రైస్తవులు కేవలం పాటలు పాడిరి. అందువలన క్రైస్తవారాధనలో వాద్యసంగీతము దేవుని వలన గాక మానవులని వలన మాత్రమే కలిగెనని మనము గ్రహించుకొన గలము. నిజానికి క్రీస్తు సంఘము స్థాపించబడిన కొన్ని వందల సంవత్సరముల తరువాతనే క్రైస్తవారాధనలోనికి వాద్యములు చేర్పించబడినవి. క్రీస్తు శకము 670 వ సంవత్సరములో మొట్టమొదటి 'ఆర్గన్' అనువాద్యము ఆరాధనలో ప్రవేశపెట్ట బడెను. పోప్‌వైటాలియన్ అనునతడు దీనిని ప్రవేశపెట్టగా రోమన్ కేథలిక్ సంఘము లో చీలిక లేర్పడెను. అందువలన వెంట నే అది నిర్మూలించబడెను. అయితే క్రీస్తు వచ్చిన 800 సంవత్సరముల తరువాత 'ఆర్గన్' అనువాద్యము రోమన్ కేథలిక్కుల గుడులలో కొంత ప్రతఘటన తోనే మరల ప్రవేశపెట్ట బడెను. తత్ఫలితముగా ఉద్భవించిన గ్రీక్ ఆర్థొడాక్స్ సంఘము నేటికిని వాద్యములు వినియోగించరు.

యేసుక్రీస్తు స్థాపించిన సంఘములో వాద్యములు ఎన్నడు వినియోగింపబడలేదని మనం ఇట్టే తెలిసిన కొనగలము. క్రొత్త నిబంధన దానికి అనుమతి నియ్యలేదు. క్రీస్తు వచ్చిన అనేక వందల సంవత్సరముల తరువాతనే వాద్యములు ప్రవేశపెట్టబడెనని ప్రపంచ చరిత్ర కూడా చెప్పుచున్నది.

ఆరాధనలో వాద్య సంగీతమును ప్రోత్సహించువారు తరుచు ఒక వాదన చేస్తారు. ఈ వ్యాసాన్ని ముగించక ముందు దాన్ని పరిశీలించగోర్తాను. "పాత నిబంధన కాలంలో వాద్యములు వినియోగించారు కదా?" యని తరుచు వారు వాదిస్తారు. అవును తప్పక వారు వినియోగించారు అని జవాబిస్తాను. ఉదాహరణకు 150వ కీర్తనలో దేవుని స్తుతించుటకుగాను అనేక వాద్యములు అక్కడ చెప్పబడి యున్నవి. అయితే పాతనిబంధనలో చెప్పబడినంత మాత్రాన వాటిని క్రొత్త నిబంధన ఆరాధనలోకి తేవాలని ఎక్కడాలేదు. మీరు పశుబలులను, సాంబ్రాణి పొగలను ఎందుకు అర్పించరు? అని వారినడిగినప్పుడు "సాంబ్రాణి పొగలు, పశుబలులు పాత నిబంధన ఆరాధనలోనివి గదా?" యని వారు తిరిగి జవాబిస్తారు.

వారి జవాబు ఖచ్చితంగా కరెక్టే. ఏలయనగా మనం మోషధర్మశాస్త్ర కాలములో జీవించుట లేదు (రోమా 7:47; 2 కొరింథీ 3:7,11; కొలస్స 2:14). నేడు ఆరాధనలో మనం యేమి చేసినా అది క్రీస్తు

చట్టమగు క్రొత్త నిబంధనలో కనబడాలి. క్రైస్తవారాధనలో పశుబలులకు. సాంబ్రాణి పొగలకు దేవుని గ్రంథములో ఎంత అనుమతి యున్నదో వాద్యములకు కూడా అంతే యున్నది.

మొదటి శతాబ్దపు సంఘములో వాద్యములు కనబడవు. క్రైస్తవులు పాటలు పాడాలని అజ్ఞాపింపబడ్డారు. దేవుని మార్గముతోనే మనం సంతృప్తి జెందాలి. " దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని" యేసు చెప్పెను (యోహాను 4:24).

– కెన్ టైలర్ .

## రండి, ఆరాధించుదము !

(Oh Come, Let us Worship !)

"రండి నమస్కారము చేసి సాగిలపడుదము. మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము. ఆయన మన దేవుడు" (క్రీర్తన 95:6).

క్రొత్త నిబంధన యుగములో యేసు ఆరాధనను ఇట్లు వర్ణించారు: "అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చే యున్నది." (యోహాను 4:23).

తరములబడి ప్రతి వారం పారం పర్యాచారముగా మనం చేయు ఆరాధన గాక ఆరాధనను గూర్చి బైబిలు చెప్పు యదార్థ సంగతులను గమనించుటకు ప్రయత్నిం చుదాం.

"ఆ మనుష్యుడు తన తలవంచి యెహోవాకు మ్రొక్కెను" ఆది.కా. 24:26.

"అబ్రాము సాగిలపడియుండగా, దేవుడతనితో మాట్లాడెను...." ఆది.కా. 17:3.

"అందుకు మోషే త్వరపడి నేల వరకు తలవంచుకొని నమస్కారము చేసెను" (నిర్గమ 32:8).

"సర్వజనులారా యెహోవాను సన్నుతించుడి" "ఆయన బహుగా స్తుతి నొంద తగినవాడు. ఘనతా ప్రభావములు ఆయన సన్నిధిని ఉన్నవి !! "యెహోవా నామమునకు తగిన మహిమ ఆయనకు చెల్లించుడి.. ఆయన సన్నిధికి రండి... ఆయన యెదుట సాగిలపడుడి", "జనులందరు ఆమేన్ అని చెప్పి యెహోవాను స్తుతించిరి" (1 దినవృ 16:23, 26,29,36).

"సర్వలోకము నీకు నమస్కరించి

నిన్ను కీర్తించును నీ నామమును బట్టి నిన్ను కీర్తించును " (కీర్తన 66:4).

"మన దేవుడైన యెహోవాను ఘనపరుచుడి, ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు" (కీర్తన 99:5).

"ఆయన నివాస స్థలములకు పోదము రండి. ఆయన పాద పీఠము ఎదుట సాగిలపడుదము రండి" (కీర్తన 132:7).

"ఇందు వలన దేవుడు నిజముగా మీలో ఉన్నాడని ప్రచారము చేయుచు అతడు సాగిలపడి దేవునికి నమస్కారము చేయును" (1 కొరింథీ 14:25).

సాతానుడు కూడ క్రీస్తును శోధించినప్పుడు, తన ఘనత కొరకు ఆయన యేమి చేయాలో ఎరిగినవాడయై యుండెను; "నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటన్నిటిని నీకిచ్చెదనని ఆయనతో చెప్పెను " (మత్తయి 4:9).

"ఆయనను ఆరాధించువారు ఆత్మతోను. సత్యముతోను ఆరాధించవలెనని" యేసుప్రభువు చెప్పెను (యోహాను 4:24). అందు వలన ఆరాధించువారు తమ్మునుతామ్ము పరీక్షించుకొని ఆరాధించుట యుక్తమని నేను భావిస్తాను.

ఆరాధనను గూర్చియున్న ఈ లేఖన భాగములను పునఃపఠించుము. అవి సరదాగా, హాయిగా, కూర్చుని, గడియారాన్ని గమనిస్తూ యున్నట్లున్నవా ? లేదా అవి మన శక్తి, సామర్థ్యాన్ని, భక్తిని, కోరుచూ దేవుని సన్నిధిలో మనం వుండవలసిన విధానాన్ని సూచించుచున్నవా ? ఆత్మీయారాధనలో నిమగ్నులమై మనం గడియారాన్ని గమనిస్తు యుండవలసిన పనిలేదు. అట్టి పని దేవదూషణయే అగును.

దేవుడిచ్చిన మార్గదర్శక సూత్రములను పాటించుచు ఆయన కోరు రీతిగ ఆరాధించుటకు మనం యేమి చేయాలి ? యేమేమి మార్పులు చేయాలి ? దిగువ కొన్ని సహాయార్థకరమైన సలహాలనిచ్చుచున్నాను. వీటిని పాటించిన యెడల మన ఆరాధనలో ఆత్మీయంగా మేలు పొందగలమని నా విశ్వాసము.

**ఎల్లప్పుడు, ఎల్లప్పుడు ... ఎల్లప్పుడు :**

ఆరాధన క్రమమును జరిగించు పురుషులు ఎల్లప్పుడు, ఎల్లవేళలా తాము చేయునదంతా దేవుని ఘనతకు, మహిమ కొరకు మాత్రమే యని గుర్తుంచుకొనాలి. ఆరాధనలో పాల్గొనువారు బలపరచబడుదురు. అనేక రీతులుగ మేలు పొందుదురు. గాని ఈ సమయం మాత్రం స్వీయ ఘనత కొరకు గాక దేవుని కొనియాడుటకు ఉపయోగింపబడాలి. బైబిలు తరగతి సమయంలో కూడ యిట్టి విధమైన పఠనము జరిగించబడాలి.

1. ఎ) శనివారం రాత్రి నుంచి విశ్రాంతి

నొంది ఆరాధనకు సిద్ధపడాలి. బి) ఆదివారం ఉదయాన్నే లేచి ఆరాధన కొరకు సిద్ధపడాలి. సి) ఆరాధన స్థలమునకు ముందుగానే చేరుకొని ఆరాధించుటకు మానసికంగా సిద్ధపడాలి. యిలా చేయడానికి మనం నిశ్చయించుకొని పనిచేయాలి.

2. ఆరాధన స్థలము దగ్గరకు వచ్చిన తరువాత సహోదరులను పలకరించడం, వారితో సంభాషించడం అంతా వెలుపల ఆవరణలో జరిగితే మంచిది. మనం లోపల హాలులో ప్రవేశించే సరికి ఆరాధించుటకు సిద్ధంగా యున్నామని అర్థం.

3. ఆరాధన ప్రారంభం కావడానికి ఇంకా సమయం వున్నట్లయితే బైబిలు చదువుటయో, ప్రార్ధనచేసికొనుటయో, ధ్యానించుటయో జరుగవలెను. ఈ సందర్భంలో దేవుని గూర్చి ధ్యానిస్తుయుంటే మంచిది.

ఆరాధన : ఆరాధన అంతటిలోను దేవత్వమే మన ముఖ్యాంశము. ప్రతివారు తమ హృదయపూర్వకముగా పాడునట్టి పాటలను ఎంచుకోవాలి. దేవుని స్తుతించడానికి, ఘనపరచడానికి, కృతజ్ఞత చెల్లించడానికి, ప్రేమను ప్రకటించుడానికి ఉపకరించే పాటలు పాడాలి.

బి) ప్రార్ధనలు కూడా సుత్తికి, కృతజ్ఞతకు సూచనగా యుండాలి గాని ప్రార్ధించువాని వ్యక్తిత్వానికి కాదు. అంతే కాదు వ్యక్తిగత క్రైస్తవుల అవుసరాలను తెలిసికొని వాటి కొరకు ప్రార్ధించుటలో జాగ్రత్త వహించాలి. ఏదైనా ఒక ప్రాంతము గాని, దేశము గాని ఇబ్బందిలో యుంటే దాన్ని గూర్చే ప్రార్ధించాలి. మన పరలోకపు తండ్రి అందరికి ప్రభువై యున్నారు. గనుక ఆయన సన్నిధికి మన విజ్ఞాపనములు తీసుకొని వెళ్ళాలి. ఆయన చిత్తమైతే ఆయా ఇబ్బందులను తొలగించమని ప్రార్ధించాలి.

ప్రార్ధనలు క్లుప్తముగా యుండాలి, తరచు ప్రార్ధించాలి, ప్రార్ధనలోని మాటలు నిష్కల్మషముగా యుండాలి. పదేపదే వల్లించకూడదు. ప్రతి తలంపు హృదయ పూర్వకమైనదై యుండాలి.

సి) ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజనములో పాలు పొంది సహవాసము కలిగి యున్నట్లే నేడుకూడ మన ఆరాధనలో అట్లే యుండవలెను. ప్రభురాత్రి భోజనంలో మనం ఒండొరులతోను, దేవునితోను. సహవా సము కలిగియుందుము.

ప్రభురాత్రి భోజనంలో పాల్గొనక ముందు ప్రార్ధనలో గడిపి ప్రతివాడు తన్ను తాను పరీక్షించుకొనవలెను. సహోదరులలో ఏమైనా ఆరోపణ లున్నట్లయితే ఈ సమయమందు అవి కరెక్ట్ చేయబడుటకు అవకాశము కల్గును.

ఈ రీతిగా అందరి హృదయాలు ఏకమై పరిశుద్ధ పరచబడినవై యుండగా లేఖన భాగము చదివి దాన్ని కొంత

వివరించుట మంచిది.

ఇ. కానుకలు వ్యక్తుల యొక్కయు సంఘము యొక్కయు ప్రేమను ధారాళముగా ప్రతిబింబింపచేయునట్లుండాలి. దేవుని యొక్కయు ఆయన ప్రేమయొక్కయు గొప్పతనాన్ని మనం గ్రహించినట్లయితే , అంధకారములో యున్నవారికి సువార్తనందించునట్లు ఇచ్చుటలో మనం ప్రోత్సహించబడాలి.

మనం ఆరాధన చేయునప్పుడు నిలబడాలా? కూర్చోవాలా? సాగిలపడాలా? లేఖనాల్లో ఇందు విషయమైన నియమం యేదీ ఇయ్యబడలేదు. అయితే మనం చదివిన లేఖన భాగాలు కొంత మాదిరిని మనకు చూపించుచున్నవి. ఆరాధన కూర్చుని గాని నిలబడి గాని చేయవచ్చును. కూర్చోగలిగితేనే ఆరాధన అంతటిలోను పాల్గొనగలము. లేఖనాల్లో ప్రజలు దేవుని సన్నిధిలో నిలబడినట్లు కూడ వ్రాయబడింది.

అన్నిటి కంటే ముఖ్యముగా ఆరాధన దేవుని సన్నిధిలో వంగి నమస్కారము చేసినట్లు వ్రాయబడింది. వారి ముఖములు నేలవైపు వంగియుంచినట్లుగుపడును. మన ఆరాధనలలో యిట్టి విధేయత, దీనత్వము కనబడుట లేదు. అనుభూతిని మనం పొందలేక పోవుచున్నామని నాయభిప్రాయం.

ఆరాధనను లేఖనములు ఎట్లు వివరించుచున్నవి? దైవావేశ లేఖకుడు సంఘారాధనను, ఇశ్రాయేలీయులు అనుభవించిన దేవుని ప్రత్యక్షతను దిగువ రీతిగా వర్ణించుచున్నాడు.

"ఇప్పుడైతే సీయోను కొండకును, జీవము గలదేవుని పట్టణమునకు, వేవేల కొలది దేవ దూతల యొద్దకును, పరలోకమందు వ్రాయబడియున్న జ్యేష్ఠుల సంఘమునకును, వారి మహోత్సవమునకును, అందరి న్యాయాధిపతియైన దేవుని యొద్దకును సంపూర్ణసిద్ధిపొందిన నీతి మంతుల ఆత్మ యొద్దకును, క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన యేసునొద్దకును హేబేలు కంటే మరి శ్రేష్టముగ పలుకు ప్రోక్షక రక్తమునకును మీరు వచ్చియున్నారు." (హెబ్రీ 12:22-24).

ఎంత ఆశ్చర్యకరమైన సమూహమో! మనం ఆరాధన చేయునప్పుడు ఎంత మహిమ గల ప్రదేశములో ప్రవేశించెదమో! అట్టి సమూహములో మనం ఆత్మలను పరీక్షించుకొనుచు, దీన హృదయంతో ప్రవేశించుట ఎంత అవుసరమో! ప్రభువు దినమందు మనందరికీ ఎంత ఆత్మ ఉద్రేకపూరిత అనుభవమో గదా!

అందువలననే బైబిలు పఠన కాలములో ప్రవేశించి దేవుని వాక్యమును ధ్యానించి ఆరాధనలో ప్రవేశించుట ఉత్తమము. ఒకరినొకరు హెచ్చరించుకొనుచు, పురికొల్పుచు ఆరాధనలో పాల్గొందుము గాక !.

-బెట్టీ ఫోట్.

# పది ఆజ్ఞలు పాటిస్తే రక్షింపబడుదుమా?

## (Will Keeping the Ten Commandments Save us?)

పది ఆజ్ఞలు పాటిస్తే చాలు రక్షింపబడ్తాము, దేవుడు సంతోషిస్తాడు అనే మాటలు తరుచు వింటూ యుంటాము. దేవుడు మోషే ద్వారా ఈ పది యాజ్ఞలను సీనాయి కొండపై ఇశ్రాయేలు జనాంగమున కిచ్చారు. వారు ఐగుప్తు బానిసత్వము నుండి విడుదల పొంది అరణ్యములో యుండగా ఆయాజ్ఞలు వారికి జారీచేయబడ్డాయి. సీనాయి కొండపై పదియాజ్ఞలతో పాటు అనేక ఆజ్ఞలు జారీ చేయబడినను, పదియాజ్ఞలు పాటించుటే మానవ కోటికి విధియని అనేకులు తలస్తారు.

**ధర్మశాస్త్రము శిక్షవిధించెను:**

పది యాజ్ఞలు మనలను రక్షింపనేరవని బైబిలు బోధించుచున్నది. అవిరక్షింపగలిగితే యేసు క్రీస్తు ఈ లోకమునకు రావలసిన అవుసరం యేమీ లేదు. పదియాజ్ఞలతో కూడిన ధర్మశాస్త్రము క్రీస్తుకు 1500 సంవత్సరముల పూర్వము ఇయ్యబడెను. గాని విశేషమేమంటే ప్రజలను రక్షించుటకు బదులు అదివారిని శిక్షకు గురిచేసెను. ఏలయనగా అదివారి మంచి చెడుగుల జ్ఞానము నభివృద్ధిజేసి, దానినుల్లంఘించినప్పుడు వారిని దేవునికి మరింత బాధ్యులనుగా చేసెను. "ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏమనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చ బడడు. ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది" (రోమా 3:20).

నిజానికి ధర్మశాస్త్రము మంచిదే అయినను, అది ప్రజల మేలు కొరకు నిర్దేశించబడినదైనను, దానిన తిక్రమించుట వలన కలుగు పాపపు అపరాధము ను నిర్మూలించు శక్తి దానియందు లేకుండెను. అందరును పాపము చేసినవారే (రోమా 3;23). మరియు పాపము వలన కలుగు జీతము మరణము (రోమా 6:23). ప్రజల అపరాధమును నిర్మూలించుటకు గాను బలి అవుసరమయ్యెను. దేవుడు వారికి తాత్కాలిక పశుబలి పద్ధతిని యేర్పాటు చేసెను. అది సంస్కార రూపముగా వారిపాపమును నిర్మూలించెను గాని నిజానికి వారికి పాపక్షమాపణను సంపాదించ లేక పోయెను. "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము " (హెబ్రీ 10:4). అనేక శతాబ్దముల తరువాత యేసుక్రీస్తు వచ్చి తన్ను తానే బలిగా అర్పించుకొని పాపములను పరిహరింపగలిగెను. "మేకల యొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక స్వరక్తముతో ఆయన ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను"(హెబ్రీ 9:12).

పదియాజ్ఞలతోను, ఇంకా అనేకమైన అజ్ఞలతోను కూడిన మోషే ధర్మశాస్త్రము శాంతి భద్రతలను పరిరక్షింపుట కనుగ్రహించబడి బాల శిక్షకునిగా పని చేసెను. క్రీస్తు వచ్చి దానిని తొలగించెను. శతాబ్ధముల యనంతరము క్రీస్తు నందలి విశ్వాసము రాగా, ఇక ఆబాల శిక్షకుని ప్రయోజనము లేక పోయెను (గలతీ 3:19,24,25). ఇప్పుడు క్రీస్తు మనకొక నూతన ధర్మశాస్త్రమునను గ్రహించియున్నారు. అది 'విశ్వాసన్యాయము' అని పిలువబడుచున్నది (రోమా 3:27). ఈ నూతన నియమము క్రీస్తు యొక్క సువార్తయే. అది నమ్ము ప్రతివానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నది (రోమా1:16). అందువలన మోషే ద్వారా ఇయ్యబడిన ఆపాత ధర్మశాస్త్రము క్రిందనేడు ఎవడును లేడు. దాని యొద్దకు మరల వెళ్లుటకు ప్రయత్నిస్తే క్రీస్తు ద్వారా కలిగిన పాప క్షమాపణను నిరాకరించి తిరిగి శిక్షా విధినే ఎంచుకొనినట్లగును.

అట్లయితే ఇప్పుడు విగ్రహారాధన చేయవచ్చు, నరహత్య చేయవచ్చు, వ్యభించరింపవచ్చు, దొంగిలవచ్చు, ఆశించవచ్చు అని యర్థమా ? పది యాజ్ఞలు నిర్మూలించబడినందున పై వాటినన్నీ చేయవచ్చా? అట్లుకానేకాదు. మోషేద్వారా ధర్మశాస్త్ర మియ్యబడక ముందునుండే, ఆది నుండే ఈ నైతిక సూత్రముల నుల్లంఘించుట తప్పే. పది యాజ్ఞలు ఇయ్యబడక పూర్వమే నరహత్య తప్పు, వ్యభిచరించుట తప్పు, దొంగిలించుట మొ॥నవి తప్పు, ధర్మశాస్త్రమున్నను, లేక పోయినను ఈ నైతిక సూత్రములు మానవ హృదయములలో ఆది నుండి వ్రాయబడి యుండెను (రోమా 2:14-15). కయీను హేబెలును హత్య గావించి పాపము చేసెను. అప్పటికి పదియాజ్ఞలు ఇయ్యబడలేదు!

అయితే ఇప్పుడు మనం పది యాజ్ఞల వలన రక్షింపబడము, మనం చేసిన పాపముల నుండి రక్షించుటకు గాను మనకొక రక్షకుడు అవుసరం. క్రీస్తు లేకుండా ధర్మశాస్త్రము మనలను రక్షించగలిగిన యెడల, దేవుడు తన కుమారుని సిలువపై బలి ఇయ్యవలసి యుండక పోవును. మన నిరీక్షణను నేడు మనస్వనీతి మీదను, పాపరహిత జీవితం మీదను ఆధారపరచి మనలను మనమే మోసపుచ్చుకొనము. పదియాజ్ఞలు పాటించుచున్నామని డప్పు కొట్టు కోము. గాని మన పాపములు మోసిన యేసు నొద్దకు మనం పరుగిడాలి. ఆయనే మన ఆశ్రయం ఆయన రక్తము ద్వారానే మనం పవిత్రులం కాగలము. "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడునని" యేసే చెప్పెను (మార్కు 16:16).

– జాన్ థీసన్

# పరిశుద్ధాత్మ పరిమాణములు
## (Measures of the Holy Spirit)

అద్భుతములు యింకను జరిగించబడు చున్నవని అనేకులు నమ్ముదురు. మొదటి శతాబ్దమందు అపొస్తలులు పొందిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఈనాడు దేవుని పిల్లలు కూడ పొందగలరు అని బోధించు వారు పైన చెప్పబడిన సిద్ధాంతమును ప్రకటించెదరు. పరిశుద్ధాత్మ పరిమాణములను సరిగ ఎరుగనందు వలన ఈ గందరగోళము అంతయు ఉద్భవించినది.

**1. "పరిమాణము లేకుండా క్రీస్తు పరిశుద్ధాత్మను పొందెను:**

ఏలయనగా దేవుడు తాను పంపిన వానికి కొలతలేకుండ ఆత్మననుగ్రహించును గనుక ఆయన దేవుని మాటలే పలుకును" (యోహాను 3:34). అందుచే ఆయనకు అన్నియు చేయు శక్తి అనుగ్రహించెను. మూగవారికి మాట లాడనిచ్చెను, చెవిటివారికి వినుటకు శక్తి వచ్చెను, జనసమూహము లను పోషించెను, నీటిపై నడచెను, సముద్రము నణచెను, చనిపోయిన వారిని బ్రతికించెను. అన్నిటికంటె గొప్పగా ఆయన చనిపోయి బ్రతికెను. కాని ఎందుకు? వాక్యమును స్థిరపరచి విశ్వాసులనుగా చేయుటకు (యోహాను 20:30,31).

**2. పరిశుద్ధాత్మ బాప్తిస్మము క్రొత్త నిబంధనలో రెండు సందర్భములలో మాత్రమే జరిగెను:**

మొదటగా అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2). దీనికి ముందుగనే వారిని సర్వసత్యములోనికి నడిపించుటకు ఆదరణ కర్తను పంపించెదనని క్రీస్తు వారికి వాగ్దానము చేసెను (యోహాను 16:13). క్రీస్తు వెళ్ళిపోవుచుండెను . అయితే అపొస్తలులకు యింకను నడిపింపు అవసరమని గ్రహించి వారిని నడిపించు నిమిత్తము పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన తరువాత యితర భాషలలో మాటలాడు శక్తి వారికి కలిగెను. వారు కుంటివారిని బాగుచేసిరి, రోగులను స్వస్థ పరిచిరి, చనిపోయిన వారిని లేవదీసిరి. అద్భుతములు చేయగల్గునట్లు యితరులపై వారు చేతులుంచిరి. అట్టి శక్తిని వారు కలిగియుండిరి.

రెండవది–కొర్నేలి యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. యూదులవలె అన్యజనులను కూడ దేవుడు అంగీకరించునని తెలియజేయు టకు యిది జరిగెను (అపొ.కా. 10:11). వారు దానిని పొంది,

అన్యభాషలలో మాటలాడుట ద్వారా దానిని నిరూపించినప్పుడు "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆంటకము చేయగలడా?" అని పేతురు ప్రశ్నించెను (అపో.కా. 10:47). దీనిని గూర్చి పేతురు యిట్లు వర్ణించెను : "నేను మాటలాడ నారంభించి నప్పుడు పరిశుద్ధాత్మ మొదట మన మీదికి దిగిన ప్రకారము వారి మీదికిని దిగెను" (అపో.కా. 11:15). విశ్వాసులందరి వలె కొర్నేలి యింటివారికి పరిశుద్ధాత్మ కలిగెను అని పేతురు చెప్పుటలేదని గమనించుము. గాని వారు అపొస్తలుల పొందినరీతిగ పరిశుద్ధాత్మను పొందిరి.

**3. చేతులుంచగా కలుగు పరిశుద్ధాత్మ పరిమాణము :**

చేయవలసిని పని ఎక్కువగుట చేతను. అపొస్తలులు కొద్ది మంది యగుట చేతను, వారు పరిశుద్ధాత్మ శక్తిని యితరులు పొందగల్గునట్లు వారిపై చేతులుంచిరి. మొదట ఏడుగురిపై అపొస్త లులు తమ చేతులుంచిరి (అపో.కా. 6:6). ఫిలిప్పు వంటి సువార్తికులు సమరయకు వెళ్ళి అద్భుతములు చేయు శక్తిని యిట్లు పొందగల్గిరి. దాని ద్వారాఅనేకులు సువార్త కులో బడిరి. కాని ఫిలిప్పు ఈ శక్తిని ఇంకొకరికి యిచ్చుటకు వీలులేకుండెను. తరువాత అపొస్తలులైన పేతురు యోహానులు యెరూష లేము నుండి వచ్చి అద్భుతములు చేయు శక్తిని పొందగల్గునట్లు జనులపై చేతులుం చిరి (అపో.కా. 8:14,17).

**4. సాధారణ రీతిగ లభించు పరిశుద్ధాత్మ పరిమాణము పొందిన వారు :**

అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు తప్ప అందరు పరిశుద్ధాత్మ వరమును సామాన్య పరిమాణ ములో పొందిరి. దీనిని పొందిన వాడు పరిశుద్ధాత్మను పొందునుగాని అద్భుత శక్తిని కాదు. పెంతెకోస్తు దినమున పేతురు "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పెను (అపో.కా. 2:38).

పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపొస్తలులకు మాత్రమే వాగ్దానము చేయబడెను. ప్రభువుచే అది అనుగ్రహించబడెను; అది వారిని సర్వ సత్యములోనికి నడిపిం చుటకు, వాక్యమును స్థిరపరచుటకు, క్రొత్త నిబంధనను వ్రాయుటలో నడిపించు టటకు సహాయ కారిగ యియ్యబడెను. కొర్నేలి యింటివారైతే నీటి బాప్తిస్మము పొందక మునుపే వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

చేతులంచుట ద్వారా పరిశుద్ధాత్మను పొందు వరము అపొస్తలులకు మాత్రమే

అనుగ్రహించబడెను. అపొస్తలులు, వారు చేతులుంచిన వారు మరణించగా ఆత్మ సంబంధమైన అద్భుత కార్యములు సమాప్తి ఆయెను. అప్పటికి క్రొత్త నిబంధన సంపూర్తిగా లిఖింప బడుటచేతను, దాని ద్వారా మానవుడు సత్యము నందు నడిపించు బడుటకు ఉద్దేశింపబడుట చేతను, వాటి అవుసరము ఇంక లేక పోయెను (యాకోబు 1:25,2తిమో 3:16,17).

అయితే ఈ నాడు కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందితిమని, అద్భుతములు చేయగల శక్తి ఉన్నదని చెప్పుకొనువారి సంగతి యేమి? వారు వారు మోసగించబడి, తప్పుగా నడిపింపబడిన వంచకులై యున్నారు. వారు దేవుని చిత్తప్రకారము చేయలేనప్పుడు ఆత్మవారిని ఎట్లు నడిపించగలదు? బైబిలు నందు లేని సంఘము లోనికి పరిశుద్ధాత్మ వారిని నడిపించునా? మానవకల్పిత నామములు ధరింపనీయునా? అట్లు ఎన్నడు కానేరదు. నిజముగా వారికి అద్భుత శక్తి ఉన్న యెడల అపొస్తలులు, యేసుక్రీస్తు చేసిన వాటన్నిటిని చేయగలరు. వారు డంబములను చెప్పుకొనుటయే తప్ప ఏమియును చేయలేరు. నా మిత్రుడా, వారి అబద్ధ బోధలను బట్టి మోనపోకుము. బైబిలు మాత్రమే నీ మార్గదర్శిగా ఉండనిమ్ము.

- జె.సి. ఛోట్

**గమనిక ::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు ఆరాధన ఛానల్ లోను, సాయంత్రము 7 గంటలకు UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# సంక్షిప్త వార్తలు

2010 జూలై 2వ తేదీ శుక్ర వారం గోరింటలోని క్రీస్తు సంఘము స్త్రీల సహవాస కూటము నేర్పరచిరి. ఆ కూటమునకు పరిసర గ్రామములనుండి, సంఘములనుండి అనేక స్త్రీలు హాజరై గొప్ప ఆత్మీయానుభూతి పొందిరి. సోదరి సుదీప గూటంగారు చక్కటి వాక్య పరిచర్య చేసిరి. సంఘములో స్త్రీ యొక్క పాత్ర, గృహములో స్త్రీ యొక్క పాత్ర అను అంశములను ఆమె చక్కగా బోధించిరి. హాజరైన స్త్రీలందరు ఆత్మీయముగా ఆ వాక్య పరిచర్య వలన బలపడిరి. గోరింటలో సోదరులు యమ్. ప్రేమ్ కుమార్ గారు పని చేయుచున్నారు.

జూలై 24వ తేదీ శనివారం అమెరికాలో లూజియానా యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేయుచున్న సోదరుడు యోహాన్ అడెన్ డోర్ఫ్ గారు పదిరోజులు సువార్త పరిచర్య చేయుటకు గాను కాకినాడ చేరుకొనిరి . వారు 25 వతేదీ ఆదివారం కాకినాడ స్థానిక సంఘములో వాక్యపరిచర్య చేసిరి. ఆ రోజు సాయంత్రం సత్యవాణి చిల్డ్రన్ హెూమ్ పిల్ల లందరితో కాకినాడ బీచ్‌లో కొంత సమయం ఆహ్లాదంగా గడిపిరి. 26వ తేదీ సోమవారం వాడపల్రు , అమలాపురం, దేవగుప్తంలలో యున్న సంఘమును దర్శించి అక్కడక్కడా వాక్యపరిచేసి సోదరులను ప్రోత్సహించిరి.

జూలై 27వ తేదీ మంగళవారం పాలకొల్లు బంగారు వారి చెర్వు ఏరియాలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును రోయన ఫ్రెడరిక్ గారు, జాషువా గూటం గారు ప్రభువు సేవార్థమై ప్రార్థన చేసి, రిబ్బను కత్తిరించి ప్రతిష్టించిరి. ఆ సందర్భములో రోయస్‌గారు. జాషువా గూటం గారు మంచి వాక్య పరిచర్యచేసిరి. అనేక మంది హాజరై స్థానిక సంఘ సంతోషములో పాలు పొందిరి. పాలకొల్లులో సోదరుల జి. షడ్రక్ గారు దేవుని కొరకు కష్టించి పని చేస్తు మంచి ఫలితములు సాధించుచున్నారు. ఆ రోజు 6గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందు నేర్పాటు చేసిరి.

జూలై 28వ తేదీ బుధవారం సత్యవాణి ఆవరణములో సువార్తి కులసదస్సు జరిగెను. పలు ప్రాంతముల నుండి అనేకులు హాజరైరి. సోదరులు ఝ. ప్రభాకర్ గారు (కాకినాడ) యోహాన్ అడెన్ డోర్ఫ్ గారు (U.S.A) , జాన్ మోజెస్ గారు (తోలేరు), రిక్కీ గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు భాస్కర్ గారి ప్రార్థనతో సాయంత్రం 4 గంటలకు విజయవంతముగా సదస్సు ముగిసెను.

# మీ కొరకు గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:


**_Satya Vani_**

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**



RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011


To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Goolam Printed by him at Satya Vani Publication, Sambbamurthy St. Kakinada - 533 004